తండ్రి ఆత్మశాంతికి
తన ఆశలు చంపుకుని
ఆమె అతణ్ణే
కోరిందేమిటి?

ముచ్చెర్ల రజనీ శకుంతల కథ

# ఆశయాల అంచులలో

"శరణ్ గారూ! మీకోసం ఎవరో అనితగారంట. వచ్చారు." ప్యూన్ రంగన్న వచ్చి చెప్పడంతో రాస్తున్న ఎకౌంట్స్ పక్కన పడేసి లేచాడు శరణ్.

'అనితంటే...' వారం రోజుల క్రితం తను పెళ్ళిచూపుల్లో చూసినమ్మాయి కాదు కదా! ఆశ్చర్యంగా అనుకుంటూ ఆఫీస్ వరండాలోకి నడిచాడు.

అతన్ని చూస్తూనే అనిత రెండు చేతులూ జోడించింది.

"నమస్తే. నేను గుర్తుండే ఉంటాను" అంది.

"ఆ! ఆ! గుర్తుంది. ఏమిటిలా వచ్చారు..." ఆశ్చర్యంగా అడిగాడు శరణ్.

"శరణ్ గారూ! ఓ ఆడపిల్ల, అందులోనూ పెళ్ళి చూపుల్లో చూసిన నన్ను ఇలా రావడం చూసి మీరు ఆశ్చర్యపోవడంలో అర్థం ఉంది. మీతో కొంచెం మాట్లాడాలి. దయచేసి కాసేపలా వస్తారా...?" ప్రాధేయపూర్వకంగా అడుగుతున్న అనితని చూస్తే అతనికి ఏ మూలో జాలి అనిపించింది.

"వన్ అవర్ పర్మిషన్ పెట్టి ఇప్పుడే వస్తాను. ప్లీజ్ వెయిట్" అంటూ లోపలికి వెళ్ళి ఐదు నిముషాల్లో తిరిగి వచ్చాడు.

"పదండి"

ఆఫీస్ దాటి బయటికి వచ్చాక అడిగాడు

"ఎక్కడికి వెళదాం."

"అలా ఏదైనా హోటల్‌కి వెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం" అంది ఎదురుగా ఉన్న హోటల్‌వైపు చూస్తూ.

ఇద్దరూ లోనికి నడిచారు.



మూలగా వున్న టేబిల్ దగ్గర కూర్చుంటూ "ఏం తీసుకుందాం" అన్నాడు.

"కాఫీ చాలు" అంది.

"రెండు కాఫీ" చెప్పాడు బేరర్‌తో.

"ఆ! ఇప్పుడు చెప్పండి. ఏవిటీ మీరిలా. .."

ఒక్క క్షణం తటపటాయించింది అనిత అయినా ధైర్యం తెచ్చుకుంటూ "శరణ్ గా

రూ! మీరు చిన్న అబద్ధం చెప్పాలి... ప్లీజ్..."

"ఏమిటీ?" అతని కళ్ళల్లో చెప్పలేని ఆశ్చర్యం.

"అవును. ఒక అబద్ధం చెప్పాలి. వెయ్యి అబద్ధాలయినా ఆడి ఒక పెళ్ళి చెయ్యమన్నారు. కానీ మీరు ఒకే ఒక అబద్ధం చెప్పి మా నాన్నగార్ని బతికించాలి..."

"అనితగారూ?..." ఆమె గొంతులోని బాధకే అతను చలిస్తూ...

"విషయం వివరంగా చెప్పండి..." అన్నాడు.

"ఏముంది! నన్ను కన్నందుకు మా నాన్నకు మిగిలిన క్షోభ ఇది. ఆస్తిపాస్తులు లేకపోయినా ఉన్నంతలో గుట్టుగా బతికే మధ్య తరగతి కుటుంబం మాది. కట్నాల రేటు ఆకాశాన్నంటుకున్న ఈ రోజుల్లో నాన్నకు 'నా పెళ్ళి' ఒక సమస్యగా తయారయింది. నేను ఉద్యోగం చేసి నెలకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నా, కట్నం కావాలంటూ చూసిన పెళ్ళి కొడుకులందరూ కోరారు. ఎంతో కష్టపడి చదివించి, ఉద్యోగం సంపాదించి ఇచ్చిన నాన్న ఇంకా కట్నం ఎక్కడ్నించి తేగలడు.

అర్థం చేసుకునేవారు ఒక్కరూ లేరు. ఆఖరికి మొన్న మీరు చూసుకుని వెళ్ళారు. నిన్న మీ అమ్మగారు "కట్నం అరవై వేలయితేనే ఒప్పుకుంటాం" అని కబురు పెట్టారు. అంత డబ్బు ఎక్కడ్నించి తేగలరు. రాత్రంతా దిగులుగానే ఉన్నారు. ఈ రోజు ఉదయమే సన్నగా గుండెనొప్పి మొదలయింది. హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేశాను. డాక్టర్ బహుశా బతకడంటున్నారు. కొన్ని గంటలు మాత్రమే.

ఆయన చావుకి 'నా పెళ్ళే' కారణం. కనీసం ఈ పోయే సమయంలోనైనా ఆయన్ని ప్రశాంతంగా సాగనంపాలనే ఉద్దేశంతోనే మీ దగ్గరికి సిగ్గువిడిచి వచ్చాను. ఒకే ఒక అబద్ధం 'మీరు నన్ను పెళ్ళి చేసుకుంటానని' మా నాన్నకు చెప్పండి. ఆయన తృప్తిగా వెళ్ళిపోతాడు. మీరు నిజంగా నన్ను చేసుకోనక్కర్లేదు. మీ అమ్మగారు కోరినట్లు అరవై వేలిచ్చిన అమ్మాయినే చేసుకుందురుగానీ. ఈ సహాయం చేసిపెడతారా శరత్ గారూ... ప్లీజ్...!" రెండు చేతులూ జోడిస్తూ అంది.

"అనితా! ముందు మీరు కళ్ళు తుడుచుకోండి..." కర్చీఫ్ అందిస్తూ అన్నాడు.

"మీరు... మీరు... నన్ను తప్పుగా అర్థం చేసుకోరుగా... కేవలం నాన్నగారి కోసం మిమ్మల్నిలా..." దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది. తనకి తెలియకుండానే వచ్చిన కన్నీళ్ళని తుడుచుకుంది.

"నేనామాత్రం అర్థం చేసుకోగలను. పదండి ముందు హాస్పిటల్‌కి వెళదాం..."

అతని వంక కృతజ్ఞతగా చూసింది.

ఆటోలో వెళ్తూ అతను ఆలోచిస్తున్నాడు.

రాత్రి తల్లితో జరిగిన సంభాషణే అతనికి గుర్తొస్తుంది.

"అమ్మా! అనిత నాకు నచ్చింది. నీకు నచ్చితే..."

"ఆగరా! వాళ్ళు పదివేలకంటే కట్నం ఎక్కువ ఇచ్చేలా కనబడ్డం లేదు. మన

పంతులుగారు ఇంకా రెండు సంబంధాలు చెప్పారు. అవి కూడా చూసి. అయినా ఎల్.ఐ.సిలో పనిచేసే నీకు లక్షకి తక్కువ కట్నం తీసుకోవడం నామోషీ కాదూ...!"

"అమ్మా! నీ కెన్నిసార్లు చెప్పాను కట్నం తీసుకోనని..."

"ఓ యబ్బో! తీసుకోకు. 'ఆశయం' గాడిద గుడ్డా అంటూ [illegible]గు. అయినా కట్నం తీసుకోకపోతే నీ చెల్లికి పెళ్ళేలా చేస్తావురా...! మనం తీసుకుంటేనే కదా, దానికి ఇచ్చేది..."

"ఆ! ఉమకి నాలాగే కట్నం కోరని వాడివిచ్చి పెళ్ళి చేస్తాలే..." విసురుగా అన్నాడు శరణ్.

"ఆ! చేస్తావ్..., నీలాటి వాళ్ళు కోటికి ఒక్కడు కూడా ఉండడు. కట్నం అక్కర్లేదన్న వాడ్ని ఒక్కడ్ని... ఒక్కడ్ని... చూపించు చూద్దాం..." తల్లి సవాల్‌గా అంటూంటే ఆమెతో వారించి దండగ అనుకున్నాడు శరణ్.

అయితే నిన్ననే కబురు పెట్టేసిందన్న మాట వాళ్ళకి. ఒక విధంగా ఆయన చావుకి తన తల్లే కారణం. ఎంత దారుణం.

తన ఆశయం ఏమిటో ఇప్పుడు నేను చెప్పినా అనిత నమ్ముతుందా...!

అతనికి ఏదో గిల్టీగా ఉంది. ఆయన ఈ స్థితికి పరోక్షంగా తామే కారణం అనే విషయం అతన్ని గిల్టీగా నిలబెట్టేస్తోంది.

"రండి. ఈ రూమ్ లోనే..."

అనిత వెంట అతని అడుగులు పరధ్యాన్నంగా పడుతున్నాయి.

"నా... న్నా...!" ఆప్యాయంగా తల నిమురుతూ పిల్చింది.

అతను మూలుగుతూ కళ్ళు విప్పి చూశాడు.

ఎదురుగా అనిత, శరణ్.

"నాన్నా...! ఈయన నీకోసం వచ్చారు' ఆతృతగా చెప్పింది.

"బాగున్నావా బాబు!" నీర్సంగా అన్నా



## సంపాదన

తండ్రి కొడుకుతో గొప్పగా చెప్పాడు "వంద రూపాయల జీతంమీద నేను వస్జేసిన షాపు నాల్గేళ్ళ తర్వాత మేడైపోయింది. అదీ సంపాదనంటే!"

"అది ఆరోజుల్లో కష్టం నాన్నా! ఇప్పుడు ప్రతిచోట కాష్ రిజిస్టర్లున్నాయ్. ప్రతి పైసకీ లెక్కలు రాయాల్సిందే...!" చాలా నిక్కచ్చిగా చెప్పాడు కొడుకు.

—ఎమ్.ఎ.కళ్యాణి (బెండమూర్లంక)

దు.

శరణ్ అతని పరిస్థితిని చూస్తుంటే ఇంక బ్రతకడని అనిపించింది. జాలితో అతని మనసు మూగబోసాగింది.

అతని మవునం అనిత మరోలా అర్థం చేసుకొని —

"నాన్నా! ఈయన ఎందుకొచ్చారో తెలుసా! నీకో శుభవార్త చెప్పడానికి..." అనేసింది గత్యంతరం లేక.

"అవునండీ! నేను మీ అనితను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. కానీ కట్నం అక్కర్లేదు. నన్ను నమ్మండి!" అతని చేతిలో చెయ్యి వేస్తూ చెప్పాడు శరణ్

"నటన బాగానే వచ్చు!" మనసులోనే మెచ్చుకుంది అనిత.

రంగనాథం కళ్ళు ఆనందంతో చెమర్చాయి.

"నిజంగానా నాయనా!" అతను నమ్మకం లేనట్లు అడిగాడు.

"నిజం అండీ ప్రామిస్" చేతిలో చెయ్యి వేస్తూ అన్నాడు శరణ్

"కానీ మీ అమ్మగారు..." రంగనాథం కళ్ళలో సంశయం.

"అమ్మని నేనొప్పిస్తానండీ! మీరేం దిగులు పడకండి. కులాసాగా ఇంటికి వెళ్ళి పెళ్ళి పనులు చూసుకోండి. నిజం..." అతను నవ్వుతూ అటూంటే రంగనాథం తృప్తిగా చూశాడు అతనివైపు అదే ఆఖరి చూపు. ఆనందం కూడా ఆయన గుండె తట్టుకోలేనట్లు ఆగిపోయింది.

తృప్తిగా, మనశ్శాంతిగా కనిపిస్తున్న తండ్రి ముఖం చూస్తే అనితకి దాచుకున్న దుఃఖం రెట్టింపయింది.

"నా...న్నా!" అంటూ బావురుమంది.

"అనితా! ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్..." భుజం పట్టి లేవదీస్తూ అన్నాడు.

* * *

"ఏరా! ఆ దిక్కూ, మొక్కూ లేని అమ్మాయినే పెళ్ళి చేసుకుందాం అని నిశ్చయించుకున్నావా..." కోపంగా అడుగుతున్న తల్లికి ఈసారి ధైర్యంగా సమాధానం చెప్పాడు శరణ్.

"అవును. నువ్వొప్పుకున్నా, ఒప్పుకోకపోయినా చేసుకుంటాను. ఇదివరకైతేనైనా ఆలోచించేవాడ్ని. కానీ ఇప్పుడు... ఆవిడ ఒంటరిదవడానికి పరోక్షంగా కారణం మనం., కాలేజీలో చదివే రోజుల్లో 'కట్నం తీసుకోను' అని ఉపన్యసించి, అనేక డిబేట్స్ లో బహుమతి కొట్టేసిన నేను, నా ఆశయానికి విరుద్ధంగా నడవలేను. నీకు నేను కావాలో... అక్కర్లేదో నిర్ణయించుకుని చెప్పు. నీ కొడుక్కి కట్నం తీసుకుని, ఆ డబ్బుతో కూతురి పెళ్ళి చెయ్యాలనుకోవడం స్వార్థం. ప్రతివాళ్ళూ ఇలాగే అనుకుంటూంటే ఈ వ్యవస్థ ఎప్పటికి మారుతుంది? కన్నతల్లివి అయివుండి మరో కన్నతల్లికి చిచ్చుపెడతావా? అసలు మీ ఆడవాళ్ళ వలనే ఈ కట్నాల బాధ మరింత పెరుగు

తోంది. అక్క కోసమో, చెల్లి కోసమో అంటూ ఆత్మవంచన. ఉమకి అన్నగా పెళ్ళి చెయ్యవలసిన బాధ్యత నాది. నీ ఇష్టం — రేపొద్దున్నే నీ అభిప్రాయం చెప్పు...'' అనేసి తలుపేసుకున్నాడు శరణ్.

వర్ధనమ్మ రాత్రంతా ఆలోచించింది.

'అవును. తన కొడుకు లాంటి మరో కొడుకు ఎక్కడైనా ఉండకపోదు. వెతికి పట్టుకోవాలి' గట్టిగా నిర్ణయించుకున్న వర్ధనమ్మ 'ఆశయాల అల్లుడి' కోసం ఎదురు చూడసాగింది.

*

